ఈనాడు
మహబూబాబాద్
గురువారం అక్టోబరు 3, 2024 7

నీటిలో తేలుతున్న భగీరథ పైపులైన్



ఈ చిత్రంలో కనిపిస్తున్న పైపులైన్ కొత్తగా వేస్తున్నది అనుకుంటే పొరపడినట్లే. నిజానికి ఇది ప్రతి ఇంటికి శుద్ధి చేసిన తాగునీరు అందించడం కోసం మిషన్ భగీరథ పథకం కింద కొన్ని సంవత్సరాల క్రితం వేశారు. మరిపెడ మండలం అబ్బాయిపాలెం నుంచి కురవి, మహబూబాబాద్ వరకు నీరు సరఫరా అవుతుంది. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు వరదనీరు రహదారుల వెంట ప్రవహించడంతో కురవి మండలం అయ్యగారిపల్లి వద్ద మట్టి కొట్టుకుపోయి ఇలా వరద నీటిలో తేలియాడుతూ కనిపిస్తోంది. -న్యూస్‌టుడే, కురవి

ఈదురుగాలులతో భారీ వర్షం



డోర్నకల్‌లో కూలిన చెట్టు

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లో బుధవారం రాత్రి ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. పలు చోట్ల చెట్టు కూలాయి. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. ఈదురుగాలులకు ప్రజలు భీతిల్లారు.

పూల పండగ.. కనువిందుగా!


మరిపెడలో వర్షంలో తరలివస్తున్న యువతులు


మాటేడులో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి..



మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో బుధవారం బతుకమ్మ పండగ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆడ పడుచులు చిన్నా పెద్దా అని తేడా లేకుండా రంగు రంగుల బతుకమ్మలను పేర్చారు. జిల్లా కేంద్రంలోని ఆయా ఆలయాల్లో, కాలనీల్లో బతుకమ్మ పాటలతో మహిళలు సందడి చేశారు.

–నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే


వర్షానికి తడవకుండా గొడుగు కింద రక్షణగా బతుకమ్మను తీసుకొస్తున్న మహిళ


కేసముద్రంలో..


జిల్లా కేంద్రంలోని రామాలయంలో


పట్టణంలోని బ్రాహ్మణబజార్‌లో..


జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ..


కృష్ణాకాలనీలో




మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం సమీపంలోని ఆకేరు వాగులోని చెక్‌డ్యాం వద్ద నిల్వ ఉండాల్సిన వరదనీరు వాగులోకి ప్రవహిస్తోంది. సుమారు రూ.30 లక్షల వెచ్చించి 14 ఏళ్ల కిందట 220 ఎకరాల ఆయకట్టుకు సాగునీరించేలా నిర్మించారు. నెల కిందట కురిసిన వానకు వరద ఉద్ధృతంగా ప్రవహించడంతో చెక్‌డ్యాం రక్షణ గోడ కోతకు గురైంది. నీరంతా వృథాగా పోతోంది.



నర్సింహులపేట మండలం జయపురం సమీపంలోని ఆకేరు వాగుపై వరదనీటితో జలకళ సంతరించుకోవాల్సిన వాగు ఒక వైపు వేసవిని తలపిస్తోంది. చెక్ డ్యాంలకు వరదకోత పడడంతో నిల్వ ఉండాల్సిన నీరంతా గండి పడిన ప్రాంతం నుంచి వెళ్లడంతో ఎండిపోయి కనిపిస్తుంది. అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతకు సాగునీటి బెంగ..!



ఈనాడు, మహబూబాబాద్, న్యూస్‌టుడే, మరిపెడ

గతేడాది జులైలో.. ఈ ఏడాది ఆగస్టు 31న కురిసిన అతిభారీ వర్షాలకు వరదలతో జిల్లాలోని పాలేరు, మున్నేరు, ఆకేరు వాగులు ఉద్ధృతంగా ప్రవహించాయి. లక్షలాది క్యూసెక్కుల వరద కృష్ణా బేసిన్‌లో చేరి అక్కడి నుంచి సముద్రంలో కలిశాయి. అందులోని కొంత వరదకు అడ్డుకట్ట వేసి ఆయకట్టు పరివాహానికి సాగునీటిని అందించడానికి, భూగర్భజలాల వృద్ధి చెందించాలనే ఆలోచనతో ఇంజినీరింగ్ అధికారులు అక్కడక్కడ రూ.కోట్ల నిధులు వెచ్చించి సుమారు 40 చెక్‌డ్యాంలను నిర్మించారు. పది వేల ఎకరాలకు ఆయకట్టు రెండు పంటలకు పుష్కలంగా సాగునీరందేది. మూడేళ్లలో, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుమారు 11 వరకు దెబ్బతిన్నాయి. పలు చోట్ల కుడి, ఎడమ వైపుల నిర్మించిన రక్షణ గోడలు 20 నుంచి 40 మీటర్ల పొడవుతో కోతకు గురయ్యాయి. కొన్ని చోట్ల పూర్తిగా నేలమట్టం అయ్యాయి. వాటికి మరమ్మతులు చేసి ఆయకట్టు సాగునీటి కష్టాలు తీర్చాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో గత యాసంగి నుంచి అవస్థలు పడుతున్నారు. గతేడాది దెబ్బతిన్న చెక్‌డ్యాంలకు శాశ్వత మరమ్మతులు చేసేందుకు దాదాపు రూ.13.70 కోట్ల నిధులు కావాల్సి ఉందని సంబంధిత ఇంజినీరింగ్‌శాఖ అధికారులు ప్రణాళికలను రూపొందించి అప్పటి ప్రభుత్వానికి పంపించారు. నిధులు రాక పనులు చేపట్టలేదని తెలిసింది.

మరమ్మతు చేస్తేనే సాగునీరు

- లూనావత్ భీమా, ఫకీరాతండా



నాకు ఎకరన్నర వ్యవసాయ భూమి ఉంది. ముంగిమడుగు గ్రామానికి చెందిన ఓ రైతు చెందిన 5ఎకరాల వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొన్న పంటల సాగు చేస్తున్నాను. గతేడాది వరదలతో ఆకేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంకు కుడివైపు విరిగిపోయి పక్కన ఉన్న రివింట్‌మెంట్ కొట్టుకుపోయింది. ఇసుక బస్తాలు అడ్డువేసి తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. ఇటీవల వచ్చిన వరదతో ఇసుకబస్తాలు కొట్టుకుపోవడంతో నీరంతా వృథాగా కిందికి పోతుంది. శాశ్వత మరమ్మతు చేయకుంటే యాసంగి పంట వరకు నీటి నిల్వ ఉండని పరిస్థితి నెలకొంది.

– న్యూస్‌టుడే, నర్సింహులపేట



చిత్రంలోని చెక్‌డ్యాం పక్కన రక్షణ గోడ(రివిట్‌మెంట్ కట్ట) భారీగా కోతపడి కనిపిస్తున్నది నర్సింహులపేట మండలం జయపురం గ్రామంలో ఆకేరు వాగు చెక్‌డ్యాం పక్కనే రక్షణ గోడ కోతకు గురైంది. 380 ఎకరాలకు నీరందించాలనే లక్ష్యంతో రూ.3 కోట్ల వ్యయంతో 2020-21లో నిర్మించారు. గతేడాది జులై కురిసిన భారీ వానలకు కొంత మేర రివిట్‌మెంట్ కట్ట కోతకు గురైంది. యాసంగిలో నీళ్లలేకపోవడంతో రైతులు జేసీబీతో గోతులు తవ్వించి పంటను కాపాడుకున్నారు. మరమ్మతులు చేయకపోవడంతో నెల కిందట కురిసిన భారీ వర్షానికి వచ్చిన వరదతో అదే ప్రాంతంలో పెద్ద ఎత్తున కోతపడింది. దాంతో నీరు నిల్వ లేదు.

బాపూజీ మార్గం అనుసరణీయం


గాంధీపార్కులో విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, పురపాలక సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్

మహబూబాబాద్, న్యూస్‌టుడే: దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు అహింసా మార్గంలో పోరాడిన మహనీయుడు మహాత్మాగాంధీ అని ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఆయన మార్గాన్ని అనుసరించాలన్నారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ మహనీయులు చేసిన సేవలను స్మరించుకోవడం ద్వారా భవిష్యత్ తరాలకు స్ఫూర్తిని అందించినట్లు [illegible] అన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ గాంధీజీ జీవిత శైలి, చూపిన మార్గాలు అనుసరణీయం అన్నారు. ముందుగా గాంధీ పార్కులో గాంధీజీ విగ్రహానికి వారంతా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవో అలివేలు, పురపాలక సంఘం అధ్యక్షుడు పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మార్నేని వెంకన్న, కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్, కలెక్టరేట్ ఏవో పవన్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏటీఎం చోరీ కేసు ఛేదన

బయ్యారం, న్యూస్‌టుడే: బయ్యారం ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసును బయ్యారం పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. చోరీకి పాల్పడిన దుండగుల్లో ఒకరిని పట్టుకొని విచారణ కొనసాగిస్తున్నారు. డీఎస్పీ తిరుపతిరావు కథనం ప్రకారం.. బయ్యారం బస్టాండ్ సెంటర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంను ఫిబ్రవరి 18న అంతర్రాష్ట్ర దొంగల ముఠా ధ్వంసం చేసి సుమారు రూ.28 లక్షల నగదు చోరీ చేసి పరారయ్యారు. జిల్లా ఎస్పీ రాంనాథ్‌కేకన్ ఆదేశాల మేరకు గార్ల, బయ్యారం సీఐ రవికుమార్ ఈ సంఘటనపై సుమారు 8 నెలలపాటు దర్యాప్తు కొనసాగించి దుండగుల్లో ఒకరిని పట్టుకొని బుధవారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్ జిల్లా పలోడి ప్రాంతానికి చెందిన అబ్దుల్ గని మరికొంత మందితో కలిసి ఫిబ్రవరి 18న అర్ధరాత్రి 1.20 గంటల సమయంలో కారులో వచ్చి గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం చోరీకి పాల్పడ్డాడు. ఈ కేసులో గనిని ఏ1 నిందితుడిగా కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు


పోలీసులు అదుపులో నిందితుడు అబ్దుల్ గని

ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేకు పైలట్ గ్రామాల ఎంపిక

మహబూబాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డులు జారీ చేసేందుకు నియోజకవర్గాల వారీగా పైలట్ గ్రామాలను ఎంపిక చేస్తోంది. గ్రామీణ ప్రాంతం నుంచి ఒక్క పంచాయతీ, పురపాలక సంఘాల నుంచి ఒక వార్డును ఎంపిక చేసి కుటుంబ వివరాల సేకరణఎ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. మహబూబాబాద్ శాసనసభ నియోజకవర్గం పరిధిలో సంద్రాలగూడెం గ్రామాన్ని, పురపాలక సంఘంలో 35 వార్డును ఎంపిక చేశారు. సంద్రలగూడెం పంచాయతీలో రెండు, 35వ వార్డులో ఐదు బృందాలు ఇంటింటికి వెళ్లి సమాచారాన్ని సేకరించనున్నాయి. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవో, కమిషనర్, డీఈల ఆధ్వర్యంలో ఒక్కో బృందం వంద కుటుంబాలను సిబ్బందితో సర్వే చేపట్టనున్నారు. ఈ నెల 3 నుంచి ఏడో తేదీ వరకు సర్వే చేయాలని ఆర్డీవో అలివేలు ఆదేశాలు జారీ చేశారు డోర్నకల్ నియోజకవర్గంలోని దంతాలపల్లి మండలం రామవరం గ్రామ పంచాయతీ, మరిపెడ పురపాలక సంఘంలో 14వ వార్డు పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైంది. తొర్రూరు పురపాలక సంఘంలో ఆరో వార్డును ఎంపిక చేశారు.

బహు పౌష్టికం.. బతుకమ్మ ప్రసాదం

బతుకమ్మ ప్రసాదం ఆరోగ్యదాయం. వాటిని చిరుధాన్యాలతో తయారుచేయడం వల్ల పోషకాలు మెండుగా ఉంటాయని హనుమకొండకు చెందిన ప్రముఖ న్యూట్రిషనిస్టు జ్ఞానేశ్వర్ తెలిపారు.





పువ్వులతో దేవుడిని పూజిస్తారు.. ఆ పువ్వులనే దేవతలుగా, ఆడబిడ్డలే ఇంటి ఆరాధ్యదేవతగా పూజించే గొప్ప ప్రకృతి పండగ బతుకమ్మ. అనుబంధాలు, ఆప్యాయతలకు ప్రతీకగా నిలిచే ఈ పండగలో ప్రసాదాలు సైతం ప్రత్యేకతను సంతరించుకుంటాయి. పూలతో తయారు చేసిన రంగు రంగుల బతుకమ్మలను చెరువు గట్లమీదకు తీసుకెళ్లి ఆడిపాడిన తర్వాత ఆడబిడ్డలు తెచ్చుకున్న ప్రసాదాలు ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుని ఆత్మీయతను పంచుకుంటారు. తొమ్మిది రోజులు రోజుకో తీరు ప్రసాదాలు(సద్ది)ని తీసుకెళతారు. తరచి చూస్తే ప్రతి సద్దిలోనూ చిరుధాన్యాలతో తయారు చేసినవి ఉంటాయి. బతుకమ్మకు రోజుకో రకంగా సమర్పించే ప్రసాదాలు.. వాటి ఆరోగ్య ప్రాముఖ్యం గురించి ప్రత్యేక కథనం..

- న్యూస్‌టుడే, కాజీపేట

1 ఎంగిలిపూల బతుకమ్మ

- ప్రసాదం: ఊక(ముడి)బియ్యం, బెల్లం కలిపిన ముద్దలు చేస్తారు.
- ప్రయోజనం: ముడి బియ్యంలో బి కాంప్లెక్సు ఉంటుంది. కొందరు నూకలతో చేస్తారు కాబట్టి త్వరగా జీర్ణం అయ్యే కార్బొహైడ్రేట్స్ అధికంగా ఉంటాయి.

మహబూబాబాద్‌లోని వేణుగోపాల స్వామి ఆలయంలో..



2 అటుకులు..

- సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో పెసర లేదా కందిపప్పును నానబెట్టి దానినే ప్రసాదంగా తీసుకెళతారు. అటుకులనే ప్రధానంగా సద్దిగా తీసుకెళతారు కాబట్టి దీనిని అటుకుల బతుకమ్మ అంటారు.
- పెసరపప్పులో ఎక్కువగా ప్రోటీన్‌లుంటాయి. బెల్లంలో ఇనుము ఉంటుంది. ఇది బాలికలకు, మహిళలకు మేలు చేస్తుంది.



3 ముద్దపప్పు


- ముద్దపప్పు, బెల్లం, పాలతో ప్రసాదం చేసుకుని తీసుకెళతారు.
- ఇందులో బెల్లం ఉంటుంది. మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. శరీరానికి కావాల్సిన ఇనుమును అందిస్తుందని ప్రముఖ న్యూట్రిషనిస్టు రమాదేవి తెలిపారు.



4 నానబియ్యం

- నానబెట్టిన బియ్యానికి పాలు, బెల్లం కలిపి వండుతారు. ఈ ప్రసాదం వేడిగా ఉండటానికి బతుకమ్మ ఆడడానికి కొద్ది సమయం ముందు తయారు చేసుకుని వెళతారు.
- ఇందులోనూ బెల్లానికి ప్రాధాన్యం ఇస్తారు.





5 అట్లు..

- బియ్యం పిండిని అట్లుగా పోస్తారు. వీటికి కొందరు బెల్లం లేదా చక్కర కలపడం వల్ల తీయగా ఉంటాయి.
- మంచి పోషకాహారం. ఎదుగుదలకు తోడ్పడుతుంది.

6వ రోజు బతుకమ్మ పండగకు సెలవు. ఈ రోజు అలిగిన బతుకమ్మగా పిలుస్తారు. ఆటకు దూరంగా ఉంటారు.



7 వేపకాయల

- సకినాలు చేసే పిండి పదార్థాన్ని చిన్న చిన్న వేపకాయలంత పరిమాణంలో ముద్దలుగా చేసి నూనెలో కాలుస్తారు. ఇవి వేపకాయల్లాగా ఉంటాయి కాబట్టి వేపకాయల బతుకమ్మ అంటారు.
- ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇంట్లో తయారుచేసుకోవచ్చు. శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.



8 వెన్న ముద్దల

- వెన్నతో తయారు చేసిన నువ్వుల ఉండలను ఫలహారంగా చేస్తారు. వెన్న, నెయ్యి, నువ్వులు శరీరానికి కావాల్సిన ప్రోటీన్‌లు, కాల్షియం అందిస్తాయి.
- వెన్న, నెయ్యి పిల్లల ఎదుగుదలకు ఉపయోగపడుతాయి.



9 సద్దుల బతుకమ్మకు సత్తుపిండి

మొక్కజొన్న గింజలు వేయించి. . వాటిని పొడి చేసి బెల్లం రవ్వలు కలిపిన పిండినే సత్తుపిండి అంటారు. సద్దుల బతుకమ్మ రోజు ఇది చాలా ప్రత్యేకం. సజ్జలలాంటి చిరుధాన్యాలతో సద్ద ముద్దలు చేస్తారు అందుకే దీనిని సద్దుల బతుకమ్మ అంటారు. ఈరోజు సద్ది(ప్రసాదాలు) ఎక్కుగా తీసుకెళతారు కాబట్టి దీనిని సద్దుల బతుకమ్మ అని కూడా పిలుస్తారు.

- పెరుగన్నం, , చింతపండు పులిహోర, నిమ్మకాయ కొబ్బరి తురుము సద్దులను చేస్తారు. సత్తుపిండి, కొబ్బరి పొడి, నువ్వుల పొడి, మలీద ముద్దలు, పులిహోర, కొబ్బరి తురుము, పండ్లు సమర్పిస్తారు. ఇవన్నీ ఆరోగ్యదాయం..



హోరాహోరీగా రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బుధవారం కోమటిపల్లి క్రీడా మైదానంలో జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 49.3 ఓవర్లలో 192 పరుగులు చేసింది. విఘ్నేష్ 55, అఫ్రిది 35 పరుగులతో రాణించారు. ఛేదనలో నిజామాబాద్ జట్టు 30 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. 118 పరుగుల భారీ తేడాతో కరీంనగర్ జట్టు విజయం సాధించింది. మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో ఆదిలాబాద్‌పై ఖమ్మం జట్టు గెలుపొందింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదిలాబాద్ జట్టు 29.3 ఓవర్లలో పది వికెట్ల నష్టానికి 109 పరుగులు చేసింది. ఖమ్మం జట్టు 30.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. గురువారం కోమటిపల్లి మైదానంలో ఖమ్మం, నిజామాబాద్: మొగిలిచర్ల మైదానంలో ఆదిలాబాద్, కరీంనగర్ జట్ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు.

జీఎన్‌ఎం కోర్సులో ప్రవేశానికి ప్రకటన

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలోని నర్సింగ్ స్కూల్‌లో జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ(జీఎన్‌ఎం)లో మూడేళ్ల కోర్సులో చేరేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ప్రకటన జారీ చేసింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 1వ తేదీ నుంచి 17 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈ నెల 29న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. వివరాలకు http:///dme.telangana.gov.in వెబ్‌సైట్ చూడాలన్నారు.

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక.. మంత్రి చేయూత



ఈనాడు కథనానికి స్పందన

పలిమెల, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి పారా అథ్లెటిక్స్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. డిసెంబరులో కంబోడియా దేశంలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు తమకు రూ.లక్ష ఖర్చవుతోందని, తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు కావడంతో నగదు సమకూర్చడం వారికి భారంగా మారింది. ఈ నేపథ్యంలో 'అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ క్రీడలకు ఎంపిక.. అడ్డంకిగా మారిన పేదరికం' అనే శీర్షికతో మంగళవారం ఈనాడులో ప్రచురితమైన కథనానికి బుధవారం కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దండెర రాజేందర్ స్పందించారు. మహాదేవపూర్ మండల పర్యటనకు వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు యువతి సమస్యను వివరించారు. నగదు సమస్యను రెండు రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ శర్మని ఆదేశించారు. మంత్రి యువతిని సన్మానించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు.

భద్రకాళి.. నమోః నమామి!



రంగంపేట, న్యూస్‌టుడే: వేదవ్యాసుడు రచించిన శ్రీదేవీ భాగవతం ప్రకారం నవరాత్రులు దేవీ ఆరాధనకు ప్రత్యేకమైనవి. విజయదశమి సందర్భంగా శరన్నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తారు. జగన్మాత నవరాత్రుల్లో తొమ్మిది రూపాలుగా దర్శనమిస్తుంది. అమ్మవారికి ఏరోజు ఏం ప్రసాదం, ఏ చీర సమర్పించాలనేది దేవీ భాగవతంలో పొందుపర్చారు. భద్రకాళి ఆలయంతో పాటు ఉమ్మడి జిల్లాలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

అవతారాలు.. అలంకరణ

మొదటిరోజు: బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారు. ఈ రోజు అమ్మవారికి లేత గులాబి రంగు వస్త్రాన్ని సమర్పిస్తారు. క్షీరాన్నం నైవేద్యం.

2వ: అమ్మవారు వేదమాత శ్రీగాయత్రి దేవిగా దర్శనమిస్తారు. నారింజ రంగు వస్త్రం, కొబ్బరి అన్నం నివేదిస్తారు.

3వ: అమ్మవారు ప్రాణకోటి ఆకలి తీర్చే అన్నపూర్ణ మాతగా దర్శనమిస్తారు. పసుపురంగు వస్త్రం, అల్లం గారెలు సమర్పిస్తారు.

4వ: శ్రీలలితా మహాత్రిపుర సుందరీదేవిగా దర్శనం. ముదురు బంగారు రంగు వస్త్రం, కదంబం ప్రసాదాన్ని నివేదిస్తారు.

5వ: శ్రీచండీ దేవిగా కొలుస్తారు. భవానిమాతగా దర్శనం, ఎర్రని వస్త్రం, ప్రసాదంగా చింతపండు పులిహోర, రవ్వకేసరి.

6వ: శ్రీమహాలక్ష్మిగా దర్శనం. ముదురు గులాబి రంగు వస్త్రం, పూర్ణం బూరెలు ప్రసాదం.

7వ: శ్రీసరస్వతి దేవిగా దర్శనం. తెల్లని వస్త్రం, నైవేద్యంగా దద్దోజనం.

8వ: దుర్గాష్టమి, మహా దుర్గాలంకరణ, ఎర్రని వస్త్రం, ప్రసాదంగా నిమ్మకాయ పులిహోర.

9వ రోజు: మహానవమి, మహిషాసుర మర్దిని అలంకరణ, ఆకుపచ్చని వస్త్రం, చక్కెర పొంగలి ప్రసాదం.

విజయదశమి: విజయదశమి పర్వదినం రోజు అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం, ఎరుపు, ఆకుపచ్చ రంగు వస్త్రాలు సమర్పిస్తారు. లడ్డూలు, పులిహోర, రవ్వకేసరి నైవేద్యం.

అయ్యో పాపం.. ఎంత కష్టం..

- పెళ్లైన ఐదు నెలలకే యువతికి రెండు కిడ్నీల్లో సమస్య
- డయాలసిస్‌తో సాగుతున్న జీవనం

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి: కూతురుకు స్తోమతకు తగినట్లు పెళ్లి జరిపించారు. బాధ్యత తీరిందనుకున్నారు ఆ అమ్మానాన్న.. ఎన్నో ఆశలతో కొత్త కాపురానికి వెళ్లింది.. మెట్టినింట్లో భర్తతో ఆనందంగా సాగిపోతోంది జీవితం.. ఇంతలోనే పిడుగు లాంటి వార్త.. నవ వధువుకు రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని వైద్యులు చెప్పడంతో రెండు కుటుంబాలు తీరని విషాదంలో మునిగిపోయాయి. ఆ యువతి జీవన్మరణ పోరాటం చేస్తోంది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కోడూరి అనూషకు ఏడాది కిందట బంధువుల అబ్బాయితో వివాహమైంది. ఆయన హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పెళ్లయిన ఐదు నెలలకు ఓరోజు అనూషకు తీవ్రమైన జ్వరం వచ్చింది. వైద్యులు పరీక్షించి రెండు కిడ్నీలు పనిచేయడం లేదని నిర్ధారించారు. కొద్దిరోజుల్లోనే మరింత అనారోగ్యానికి గురయ్యింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోజు విడిచి రోజు డయాలసిస్ చేయిస్తున్నారు. మందులకు, డయాలసిస్‌కు రెండు రోజులకు రూ.5 వేల చొప్పున అవుతున్నాయని, దాదాపు ఇప్పటి వరకు రూ. 11 లక్షల వరకు ఖర్చు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. అయినా కిడ్నీ మార్పిడికి, శస్త్ర చికిత్సలకు దాదాపు మరో రూ. 10 లక్షలకు పైగానే ఖర్చవుతాయని తెలిపారు.. రోజూ వ్యవసాయ కూలీ పనులు చేసుకుని బతికే తమకు అంత ఖర్చు భరించే స్తోమత లేదని, ఇప్పటికే అప్పులు చేసి వైద్యం అందిస్తున్నామని తండ్రి పైడయ్య పేర్కొన్నారు. దాతలు ఆదుకుంటేనే బిడ్డ దక్కుతుందని కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం, దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్న అనూష

- దాతలు సహాయం చేయదల్చుకుంటే చరవాణి నంబర్లు 85209 63145, 99129 42026 కి సంప్రదించాలి.

చికెన్ ధరలు వెన్‌కాబ్	(కిలో వెల రూపాయలలో)	
	ఫాంరేటు: 110	డ్రెస్డ్: 191
	రిటైల్: 132	స్కిన్‌లెస్: 218

పేదల బతుకులపై పిడుగు

- ముగ్గురి మృతితో విషాదం
- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే

వర్షాకాలం పిడుగుపాటు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. బుధవారం ఉమ్మడి వరంగల్‌లో ముగ్గురు మృత్యువాత పడడం విషాదాన్ని మిగిల్చింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగాయపల్లి గ్రామానికి చెందిన మహిళ రైతు కె.లక్ష్మి (45) మిరప తోటకు పిండి చల్లుతున్న క్రమంలో పిడుగు పడటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌలపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీలు నిర్మల (51), రమ (45) అదే గ్రామానికి చెందిన రైతు పొలంలో పత్తి ఏరి ఇంటికి వచ్చే క్రమంలో పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పోయారు. కూలీ పనికి వెళ్తే తప్ప పూట గడవని ఆ పేద కుటుంబాలు తీరని దుఃఖంలో మునిగిపోయాయి. పట్టణాలు, పల్లెలు ఎక్కడైనా పిడుగులు పడే అవకాశముంటుందని వాతావరణ శాఖ నిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

అపార్ట్‌మెంట్లూ అతీతం కాదు

చాలా మంది అపార్ట్‌మెంట్లపై పిడుగు పడదన్న భ్రమలో ఉంటారు. అలాంటిదేమీ లేదని, రానున్న రోజుల్లో పిడుగుల ముప్పు మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు అంటున్నారు. ముందస్తు చర్యలతో పిడుగుపాటు ప్రమాదాన్ని నివారించవచ్చని చెబుతున్నారు. వరంగల్ నగరంలో 1000కి పైగా అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వాటి సంఖ్య వేగంగా పెరుగుతోంది. పిడుగులు పడకుండా సరైన భద్రతా చర్యలు తీసుకోవడం లేదు.



- ఆరు నెలల కిందట హనుమకొండ నగరంలోని గాంధీనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌పై పిడుగుపడటంతో పాక్షికంగా దెబ్బతింది.



గాంధీనగర్‌లోని ఓ భవనంపై ఏర్పాటు చేసిన లైట్నింగ్ కండక్టర్

నిబంధనలను పాటించాలి

ఎత్తైన భవనాలు, చెట్లు పిడుగులను ఎక్కువగా ఆకర్షిస్తాయి. అందువల్ల భవన నిర్మాణ పనులలో నిబంధనలను కచ్చితంగా పాటించాలి. ప్రతి ఎత్తైన భవంతిపై తప్పనిసరిగా లైట్నింగ్ కండక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి. దీనిలో పొడవాటి రాగి, ఇత్తడి తీగను భవనం పైభాగాన అమర్చాలి. దానికి ఎర్త్ కనెక్షన్ ఇచ్చుకోవాలి. దీనికి విద్యుత్తును ఆకర్షించే శక్తి ఉంటుంది. ఇది పిడుగు ప్రభావం భవంతిపై పడకుండా అడ్డుకుంటుంది. చూసేందుకు ఇది చిన్న ఏర్పాటే కావొచ్చు. వేల వాల్టుల విద్యుదావేశాన్ని రాగి కడ్డీ ఆకర్షించి ఎర్త్ కనెక్షన్ ద్వారా భూమిలోకి పంపేస్తుంది.

ఇదీ కారణం..

క్యుములో నింబస్ మేఘాలు ఏర్పడిన సమయంలో తీవ్రమైన గాలులు, ఉరుములు, మెరుపులు వస్తుంటాయి. పిడుగు పడిన ప్రాంతంలో ఏదైనా బుగ్గి కావాల్సిందే. కొన్ని లక్షల ఓల్టుల విద్యుత్తు తరంగాలు మేఘాల నుంచి భూమిలోకి ప్రవహిస్తాయి. నీటి ఆవిరితో ఉన్న మేఘాలు ఒక్కదానికొకటి తాకడం వల్ల విద్యుత్తు పుడుతుంది. ఈవిద్యుతే పిడుగుల రూపంలో భూమిపై పడి ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమవుతున్నాయి.

కేయూ ఉప కులపతి ఎవరో?

- రేపు సెర్చ్ కమిటీ సమావేశం

కేయూ క్యాంపస్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం 15వ ఉప కులపతిని నిర్ణయించడం కోసం ఈ నెల 4న సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. 14వ ఉప కులపతిగా బాధ్యతలు నిర్వహించిన సామాజికశాస్త్రం విశ్రాంత ఆచార్యులు తాటికొండ రమేష్ పదవీకాలం ఈ ఏడాది మే 21న ముగిసింది. ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి వాకాటి కరుణను ఇన్‌ఛార్జి ఉప కులపతిగా నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు వర్సిటీలకు ఉప కులపతులు లేకపోవడంతో కొత్తవారిని నియమించడం కోసం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా కేయూ వీసీ నియామకం కోసం జేఎన్‌టీయూ విశ్రాంత ఆచార్యులు ఆవుల దామోదర్ (కేయూ నామిని), జమ్మూ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య సంజీవ్ జైన్ (యూజీసీ నామిని), రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి (ప్రభుత్వ నామిని)లతో సెర్చ్ కమిటీని నియమించారు.

158 మంది పోటీ..: విశ్వవిద్యాలయ ఉప కులపతి పదవిని దక్కించుకోవడం కోసం రాష్ట్రంలోని పలు వర్సిటీలు, విద్యా పరిశోధన సంస్థల నుంచి పలువురు పోటీపడుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా తీవ్రమైన పోటీ నెలకొంది. 158 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో కేయూ ఆచార్యులు నలుగురు బరిలో ఉన్నారు. ప్రస్తుత రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి (గణిత విభాగం), దూరవిద్య కేంద్రం సంచాలకులు వి.రామచంద్రం (రాజనీతిశాస్త్రం), టి.యాదగిరావు (ప్రభుత్వ పాలనా శాస్త్రం), టి.శ్రీనివాస్ (సామాజికశాస్త్రం)లు పదవిని ఆశిస్తున్నారు.

8 మంది విశ్రాంత ఆచార్యులు..: కేయూలో 30 ఏళ్లపాటు బోధన, పరిశోధన, పరిపాలన సేవలను అందించిన ఆరుగురు విశ్రాంత ఆచార్యులు కూడా దరఖాస్తు చేసుకున్నవారిలో ఉన్నారు. వీరిలో జి.దయాకర్, వి.రవీందర్ (రసాయనశాస్త్రం), కె.పురుషోత్తం (ఆంగ్లం), ఎం.అశోక్‌కుమార్, వెంకటనారాయణ (అర్థశాస్త్రం), బి.ఐలయ్య (తెలుగు), టి.శ్రీనివాసరావు (వాణిజ్యశాస్త్రం), సీహెచ్ దినేష్‌కుమార్ (రాజనీతిశాస్త్రం)లు దరఖాస్తు చేసుకొన్నారు.

14న దరఖాస్తుల పరిశీలన..: ఈ నెల 4న రాష్ట్ర సచివాలయంలో సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. దరఖాస్తు చేసుకున్న ఆచార్యుల, విద్యావేత్తల బయోడేటాలను పరిశీలిస్తుంది. బోధన, పరిశోధన, పాలన అనుభవాలను పరిగణలోకి తీసుకుంటుంది. అత్యంత ప్రతిభ కలిగిన ముగ్గురి పేర్లతో జాబితాను గవర్నర్‌కు అందజేస్తారు. వీరి నుంచి ఒకరిని కేయూ ఉప కులపతిగా నియమిస్తారు. ప్రక్రియ సజావుగా సాగితే 15 రోజుల్లో కేయూకు కొత్త వీసీ రానున్నారు.

డెంగీ లక్షణాలతో విద్యార్థిని మృతి



కల్యాణి (పాత చిత్రం)

చెన్నారావుపేట, న్యూస్‌టుడే: డెంగీ లక్షణాలతో విద్యార్థిని మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగెం దేవేందర్, రమ దంపతుల కుమార్తె కల్యాణి(22) హైదరాబాద్ అమీర్‌పేటలో ఉంటూ ఓ కోచింగ్ సెంటర్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం శిక్షణ తీసుకుంటోంది. ఆమెకు కొన్ని రోజుల క్రితం జ్వరం రావడంతో స్వగ్రామానికి వచ్చింది. హనుమకొండలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా డెంగీ వచ్చినట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య

- ఏకలవ్య ఆశ్రమ పాఠశాల భవనాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని



జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

కొత్తగూడ, న్యూస్‌టుడే: కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో రూ.40కోట్లతో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ ఆశ్రమ పాఠశాల(ఈఎంఆర్‌ఎస్) నూతన భవనాన్ని బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ ఝార్ఖండ్‌లోని హజారిబాగ్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. వెనుకబడిన గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు నెలకొల్పిన వీటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రారంభ శిలాఫలకాన్ని పీవో ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యున్నత ప్రమాణాలతో రూ.40కోట్ల వ్యయంతో ఈ ఆశ్రమ పాఠశాలను నిర్మించినట్లు చెప్పారు. ఇప్పటికే ఈ గురుకులంలో 500 మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికి అత్యుత్తమైన బోధన అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో అలివేలు, జడ్పీ సీఈవో నర్మద, ఆర్‌సీవో హరిసింగ్, మండల ప్రత్యేకాధికారి సురేష్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, గురుకుల ప్రిన్సిపల్ అజయ్‌సింగ్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


నెల్లికుదురు మండలం మునిగలవీడులో..


కొత్తగూడలో బతుకమ్మలను తీసుకెళ్తూ..


తొర్రూరు బీరప్ప సొసైటీ ప్రతినిధులు..


పెద్దవంగరలో..


దోర్నకల్‌లో


దోర్నకల్‌లో ..


గంగాయికుంట వద్ద


బతుకమ్మ విగ్రహం దగ్గర బతుకమ్మలు


మరిపెడ శివాలయంలో వర్షానికి తడిసి

ఊరూరా బతుకమ్మ వేడుకలు

జిల్లా అంతటా బతుకమ్మ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఎంగిలిపూల బతుకమ్మ తొలి రోజునే భారీ వర్షంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని చోట్ల వర్షం తగ్గాక మహిళలు రాత్రి సమయంలో బతుకమ్మ ఆడారు. పరదా నీడను తలదాచుకున్నారు. అనంతరం ఆటపాటలతో గడిపి చెరువుల్లో నిమజ్జనం చేశారు. – న్యూస్‌టుడే యంత్రాంగం


దంతాలపల్లి మండలం లక్ష్మీపురంలో


దాట్లలో వర్షంలో పరదా కింద బతుకమ్మలతో


కురవిలో మహిళల కోలాటం


సిగ్నల్ కాలనీలో..


బయ్యారంలో..


చిన్ననాగారం ముత్యాలమ్మ గుడి వద్ద..


గూడూరులో


గార్లలో రిక్షాపై ..


నెల్లికుదురు, బ్రాహ్మణకొత్తపల్లిలో

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499
దోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

దోర్నకల్, న్యూస్‌టుడే: దోర్నకల్ యాదవ్‌నగర్‌లో రోడ్డు పక్కన చెత్తా చెదారం పేరుకుపోయింది. - వీరభద్రం
శుభ్రం చేయిస్తాం. - అహ్మద్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, దోర్నకల్

వీధి దీపానికి మరమ్మతులు

స్పందనకు వందనం

దోర్నకల్, న్యూస్‌టుడే: జోగ్యాతండాలో వీధి దీపానికి బుధవారం మరమ్మతులు చేశారు. దీని గురించి స్థానిక లోకరు 'మేమున్నాం.. మీకు తోడుగా'కి నివేదించగా సమస్య 'ఈనాడు'లో ప్రచురితమైంది. వీధి దీపం ఏర్పాటుతో అంధకారం తొలగిందని తండావాసులు సంతోషం వ్యక్తం చేశారు.

సకాలంలో స్పందించి.. ప్రాణాలు కాపాడి

మట్టెవాడ, న్యూస్‌టుడే: డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు బుధవారం ఓ వ్యక్తిని కాపాడారు. సీఐ మచ్చ శివకుమార్ కథనం ప్రకారం.. కేరళ రాష్ట్రానికి చెందిన మను, సౌమ్య దంపతులు తమ కుమార్తెతో కలిసి పదేళ్లుగా కురవి మండల కేంద్రంలో సిద్ధార్థ పాఠశాలలో పనిచేస్తున్నారు. అక్కడ జీతం చాలకపోవడంతో ఇటీవల వరంగల్ నగరానికి వచ్చారు. ఓ లాడ్జిలో ఉంటూ నాలుగురోజులుగా మను ఉద్యోగం కోసం అన్వేషించాడు. కానీ ఎలాంటి పని దొరకలేదు. దీంతో మనస్తాపానికి గురైన మను కేరళలోని తన స్నేహితుడికి ఆత్మహత్య చేసుకుంటానని సమాచారం ఇచ్చారు. అతను వెంటనే డయల్ 100కు ఫోన్ చేశాడు. ఆ సమాచారంతో దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద ఉన్న మనును పోలీసులు గుర్తించి ఠాణాకు తీసుకొచ్చి.. కౌన్సెలింగ్ ఇచ్చారు. దంపతులు కేరళ వెళ్లడానికి ఆర్థిక సాయం చేశారు.

కదిలిన రైతులోకం..!

దోర్నకల్, న్యూస్‌టుడే: మున్నేరు వాగులోని కట్టు నుంచి సీతారాంపురం బంజర వరకు 13 కిలోమీటర్ల మేర పొడవున్న అమ్మపాలెం కట్టు కాలువని రైతులు దగ్గరుండి బాగు చేశారు. గుత్తేదారుడికి పని ఇస్తే తమ పంట పొలాలకు అవసరమైన సాగు నీరు అందడం లేదని, తామే దగ్గరుండి కాలువను బాగు చేసుకుంటామని రైతులు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డా. జాటోతు రామచంద్రునాయక్ వద్ద ప్రస్తావించగా ఆయన సానుకూలంగా స్పందించారు. రూ.5 లక్షల మంజూరుకి సైతం ఆయన సంసిద్ధత వ్యక్తం చేయడంతో రైతులు కాలువలో పూడిక తీత, పొదల తొలగింపు ప్రక్రియ చేపట్టారు.


సీతారాంపురం బంజర వద్ద కాలువని శుభ్రం చేయిస్తున్న రైతులు

నేలవాలిన వరి

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మండలంలో బుధవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నెలకొరిగింది. అక్కడక్కడ చెట్లకొమ్మలు విరిగిపడినవి. ఇళ్లపై నుంచి రేకులు కిందపడ్డాయి.


మునిగలవీడులో

విరిగిపడిన చెట్ల కొమ్మలు

నెల్లికుదురు: మండలంలో బుధవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని నెల్లికుదురు-మహబూబాబాద్ మధ్య మునిగలవీడు పరిధిలో ప్రధాన రహదారిపై చెట్ల కొమ్మలు విరిగి పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు వచ్చి వాటిని తొలగించి, రాకపోకలకు అంతరాయాన్ని తొలగించారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం


అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం బుధవారం జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లో ప్రారంభమైంది. సెకండరీ టీచర్స్ గ్రేడ్ విభాగంలో 698 మందికి అభ్యర్థులకు గాను 198 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. గురువారం పరిశీలనకు చరవాణికి సందేశం వచ్చిన అభ్యర్థులు విధిగా హాజరు కావాలని అధికారులు తెలిపారు. తమ నిజ ధ్రువపత్రాలతో పాటు రెండు జతల జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.రాజేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో ఏసీజీఈ శ్రీరాములు, కార్యాలయ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్, డీఎస్ఓ అప్పారావు, ఆజాద్ చంద్రశేఖర్, విజయకుమారి, సంతోష్, హరిత, శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయ్‌చందర్ కుటుంబాన్ని పరామర్శించిన ట్రైకార్ ఛైర్మన్

మహబూబాబాద్: ఇటీవల మృతి చెందిన టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్ కుటుంబాన్ని ట్రైకార్ ఛైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ బుధవారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వివిధ పార్టీల నాయకులు ఉదయ్‌చందర్ కుటుంబాన్ని పరామర్శించారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి


ప్రసంగిస్తున్న పింగిలి శ్రీపాల్ రెడ్డి

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మహబూబాబాద్‌లోని ఓ వేడుకల మందిరంలో ఏర్పాటుచేసిన జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 52 సంవత్సరాలుగా పీఆర్‌టీయూ ఉపాధ్యాయులకు చేసిన సేవలను వివరించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా జిల్లా కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి కార్యదర్శి నివేదికను వినిపించారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతిరెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరామర్శ


నరేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

మరిపెడ, న్యూస్‌టుడే: గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల నరేష్‌రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రునాయక్, ఖమ్మం పార్లమెంటు సభ్యుడు రఘురాంరెడ్డి, కడియం శ్రీహరి ఉన్నారు. నరేష్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితులపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

మరిపెడ, న్యూస్‌టుడే: మరిపెడ పట్టణంలోని విద్యా హెర్బ్స్ పరిశ్రమ యాజమాన్యం 30 మంది వితంతువులకు జీవనోపాధి నిమిత్తం కుట్టు మిషన్లు అందజేసింది. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ శ్యామ్‌ప్రసాద్, తహసీల్దార్ సైదులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువీరారెడ్డి, నాయకులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

దళిత, బడుగు, పీడిత వర్గాల ఐక్యతకు పోరాటం

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: దళిత, బడుగు, పీడిత వర్గాల ఐక్యతకు నిరంతర పోరాటాలు చేస్తామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా ప్రధానకార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం జిల్లా కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని నెహ్రూసెంటర్‌లో సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రామ్మూర్తి హాజరై సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు.

ఘనంగా గాంధీ జయంతి

జిల్లాలో బుధవారం మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్యం సాధనలో ఆయన త్యాగాలను గుర్తుచేసుకున్నారు. ఆయన స్ఫూర్తిగా యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. – న్యూస్‌టుడే యంత్రాంగం


బయ్యారంలో ..

మహబూబాబాద్ పురపాలక సంఘం కార్యాలయంలో


గార్లలో పారిశుద్ధ్య కార్మికులకు చేస్తున్న సత్కారం


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

నెల్లికుదురులో

ఇనుగుర్తి పంచాయితీ కార్యాలయంలో

ఎస్పీ కార్యాలయంలో


తొర్రూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ


విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..


పెద్దవంగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ..


కేసముద్రంలో


కొత్తగూడ ఎమ్మార్సీలో


మరిపెడ పురపాలిక కార్యాలయంలో

రక్తదానం చేస్తున్న కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు


దంతాలపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో..

కురవి ఎంపీడీవో కార్యాలయంలో


మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో..


తహసీల్దార్ కార్యాలయంలో


నర్సింహులపేటలో


గూడూరులో

జిల్లా ప్రథమ ర్యాంకర్‌కు సన్మానం

తొర్రూరు, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ విభాగంలో జిల్లా మొదటిర్యాంక్ సాధించిన మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన మాచర్ల లక్ష్మీభవానిని బుధవారం గ్రామంలో ఘనంగా సన్మానించారు. గ్రామ ప్రత్యేకాధికారి మాట్లాడుతూ.. యువత కష్టపడేతత్వాన్ని అలవరుచుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. గ్రామం పేరును జిల్లాస్థాయిలో నిలపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రావణి, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాకూబ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగల ముఠా..

కురవి, న్యూస్‌టుడే: వాహనాల్లో బ్యాటరీల చోరీకి పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కురవిలో కొన్ని రోజులుగా ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో బ్యాటరీలు చోరీకి గురవుతున్నాయి. దీనిపై పోలీసులు నిఘా పెట్టి ఉంచారు. బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో నలుగురు దొంగలు ఆటోలో బ్యాటరీ చోరీ చేస్తుండగా పట్టుకున్నట్లు సమాచారం. ఇద్దరు పురుషులు పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. ఇద్దరు మహిళలు ఆటోలో కూర్చొని ఉండగా వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద పెద్ద కొడవలి, ఇనుప రాడ్లు ఉన్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


సైదులు (పాత చిత్రం)

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన ఘటన ఇనుగుర్తి మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం లక్ష్మీపురం పంచాయతీ కొత్తతండాకు చెందిన బానోతు బద్రు క్రాంతిల కుమారుడు బానోతు సైదులు(28) ఉపాధి కోసం వరంగల్‌లో ఉంటున్నారు. పని నిమిత్తం బయటకి వెళ్లగా ఆదివారం రాత్రి బీమారం రోడ్డులో సైదులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం, ఆటో ఢీకొనగా సైదులు తీవ్రంగా గాయపడ్డారు. వైద్య చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందినట్లు తెలిపారు.

రామన్నగూడెంలో మహిళ ..


కవిత(పాతచిత్రం)

నెల్లికుదురు, న్యూస్‌టుడే: రామన్నగూడెంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ గుగులోతు కవిత (40) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఎస్సై సీహెచ్. రమేష్ బాబు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కవిత, ఆమె కుటుంబ సభ్యుల మధ్య ఏర్పడిన కలహాల కారణంగా మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స అందించడానికి వైద్యులు నిరాకరించారు. దీంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

రహదారి ప్రమాదంలో ఒకరికి గాయాలు

నెల్లికుదురు, న్యూస్‌టుడే: నెల్లికుదురు-తొర్రూరు ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకున్న రహదారి ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన కర్నె వెంకన్న వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడగా తొర్రూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

పిడుగుపాటుకు ఒకరికి అస్వస్థత


బానోతు బాలు

కొత్తగూడ, న్యూస్‌టుడే: కొత్తగూడ మండలం మొండ్రాయిగూడెం తండాకు చెందిన బానోతు బాలు పిడుగుపాటుకు అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఉరుములు మెరుపులతో బుధవారం సాయంత్రం వర్షం పడుతుండగా ఇంటి పక్కన ఒక్కసారిగా పిడుగు పడడంతో భారీ శబ్దానికి కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు నర్సంపేట ఆసుపత్రికి తరలించారు. ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

దోర్నకల్: దోర్నకల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అశీష్ రాజ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇతను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 5-7 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అశీష్‌రాజ్ పాల్గొనున్నటు ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు బి.నర్సింహారావు, పీడీ రవి, ఉపాధ్యాయులు అభినందించారు

రాష్ట్రస్థాయి కరాటే పోటీల గోడ పత్రికల ఆవిష్కరణ

మహబూబాబాద్: మానుకోట కరాటే క్లబ్ ఆధ్వర్యంలో నవంబర్ 17న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి షోటోకాన్ కరాటే పోటీల ప్రచార గోడ ప్రతికలను బుధవారం ఎమ్మెల్యే డా. భూక్యా మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, వెంకన్న, సీపీఐ ఫ్లోర్ లీడర్ బి. అజయసారధి తదితరులు పాల్గొన్నారు.

లాల్‌బహదూర్ శాస్త్రికి నివాళులు

మహబూబాబాద్ టౌన్: మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి అత్యంత నిజాయితీపరుడని నేతాజీ సేవా సమితి వ్యవస్థాపకుడు కందుల నాగరాజు అన్నారు. నేతాజీ సేవా సమితి బాధ్యు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ కూడలి ఆవరణలో లాల్‌బహదూర్ శాస్త్రి 120వ జయంతి నిర్వహించారు.